సాక్షి పల్నాడు

శుక్రవారం । 2 । జూన్ । 2023



పీసెట్‌కు 356 మంది హాజరు

ఏఎన్‌యూ : ఏపీ పీసెట్‌-2023 పరీక్షలకు గురువారం 356 మంది హాజరయ్యారని సెట్‌ కన్వీనర్‌ ఏఎన్‌యూ ఆచార్య పీపీఎస్‌ పాల్‌కుమార్‌ తెలిపారు.



పోలీసులకు టోపీల పంపిణీ

తాడేపల్లిరూరల్‌ : వైఎస్సార్‌ ట్రేడ్‌ యూనియన్‌ రాష్ట్ర జనరల్‌ సెక్రటరీ జక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గురువారం ట్రాఫిక్‌ పోలీసులకు టోపీలు అందజేశారు.



ప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

పెదకూరపాడు: అమరావతి నది పరివాహక ప్రాంతాల్లో సాన్నపు ఘాట్‌ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్టు అమరావతి సీఐ బ్రహ్మం తెలిపారు.

న్యూస్‌రీల్‌

పెన్షన్‌ పంపిణీ

పల్నాడులో 66.46 శాతం



నరసరావుపేటలో వృద్ధాప్య పెన్షన్‌ అందిస్తున్న దృశ్యం

నరసరావుపేట రూరల్‌: వైఎస్సార్‌ పెన్షన్‌ కానుకను నెల మొదటి రోజు గురువారం జిల్లాలో 66.46 శాతం పంపిణీ చేశారు. తొలిరోజు 1,78,240 మందికి పెన్షన్‌ కానుక అందజేశారు. వలంటీర్ల తెల్లవారుజామునే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి తలుపు తట్టి బయోమెట్రిక్‌ ద్వారా పెన్షన్‌ను పంపిణీ చేశారు.

గుంటూరు జిల్లాలో 71.06 శాతం



గుంటూరులో అవ్వకు పింఛన్‌ అందజేస్తున్న దృశ్యం

నెహ్రూనగర్‌: వైఎస్సార్‌ పెన్షన్‌ కానుకను గుంటూరు జిల్లాలో లబ్ధిదారుల ఇంటికి వెళ్ళి వలంటీర్లు అందజేశారు. వేలిముద్రలు, ఐరిస్‌ ఆధారంగా వలంటీర్లు ఇంటింటికి వెళ్ళి పంపిణీ చేశారు. జిల్లాలో గురువారం 71.06 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,51,264 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.69.02 కోట్లు కేటాయించింది. గురువారం సాయంత్రానికి 1,78,540 మంది లబ్ధిదారులకు రూ.49.10 కోట్ల నగదు అందజేశారు.

గ్రూప్‌-1 పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు




గుంటూరు వెస్ట్‌: ఆంధ్రప్రదేశ్‌ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ నిర్వహిస్తున్న గ్రూప్‌-1 పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జాయింట్‌ కలెక్టర్‌ జి.రాజుమారి తెలిపారు. పరీక్షల ఏర్పాటుకు సంబంధించి గుంటూరు కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 3వ తేదీ నుంచి 10 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరగనున్న పరీక్షలకు అభ్యర్థులు రెండు గంటల ముందుగానే హాజరు కావాలన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్‌: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.వెయ్యి, గరిష్ట ధర రూ.1,500, మోడల్‌ ధర రూ.2,000 వరకు పలికింది.

సాగర్‌ నీటిమట్టం



విజయపురిసౌత్‌: నాగార్జున సాగర్‌ జలాశయ నీటిమట్టం గురువారం 520.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌ జలాశయంకు 1,350 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 810.00 అడుగుల వద్ద ఉంది.

నేడు ప్లస్‌ టూ పాఠశాలల్లో పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్‌

గుంటూరు ఎడ్యుకేషన్‌: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్లస్‌టూ పాఠశాలల్లో వివిధ సబ్జెక్టుల వారీగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు శుక్రవారం గుంటూరులోని డీఈఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్‌ నిర్వహిస్తున్నట్లు డీఈవో పి.శైలజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిజిక్స్‌, కెమిస్ట్రీ, జువాలజీజ, సివిక్స్‌, కామర్స్‌ సబ్జెక్టుల్లో ఉన్న పోస్టులకు అర్హత గల స్కూల్‌ అసిస్టెంట్లు ఒరిజినల్‌ సర్టిఫికెట్లు, సర్వీసు రిజిస్టర్‌తో హాజరు కావాలని సూచించారు.

జనా'కర్షక పాలన' : రైతులకు పంపిణీ చేయనున్న ట్రాక్టర్లను పరిశీలిస్తున్న కలెక్టర్‌ వేణుగోపాల్‌రెడ్డి, అధికారులు



సేద్యానికి భరోసా

- 793 ట్రాక్టర్లు, 38 హార్వెస్టర్లు పంపిణీకి సిద్ధం
- నేడు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేత
- ట్రాక్టరు విలువ రూ.6 లక్షల నుంచి రూ.9 లక్షలు
- రైతు వాటా 10 శాతం, సబ్సిడీ 40 శాతం, రుణం 50 శాతం
- గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికే లబ్ధి

ఇంకా తొలకరి జల్లు పలకరించకున్నా.. పుడమితల్లి పులకించేలా.. జననేత వరాల జల్లు కురుస్తోంది. అదును ఆరంభం కాకున్నా.. కర్షక సోదరులు పరవశించేలా.. కొండంత భరోసా అందుతోంది. ముందస్తు కన్నా.. ముందే శుభమస్తు అంటూ సేద్య సంరంభానికి సంక్షేమ హారతి పడుతోంది. తొలకరి దుక్కులకు దిక్కులు చూడకుండా నిత్యకృషీవలులు 'యంత్ర'ముగ్ధమయ్యేలా వెన్నుతట్టి ప్రోత్సహిస్తోంది. ఫలితంగా వ్యవసాయం సంబరమవుతోంది. 'జై కిసాన్‌.. జై జగన్‌' అంటూ నినదిస్తోంది.

'యంత్ర'ముగ్ధం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: కర్షకవీరులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలబడుతోంది. వైఎస్సార్‌ సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి వ్యవసాయం పండగలా మారింది. రైతు భరోసాతో పెట్టుబడి భరోసా అందించడంతోపాటు విత్తు నుంచి పంట విక్రయం వరకు అన్ని విధాలా సంక్షేమ సర్కారు బాసటగా ఉంటోంది. గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందిస్తోంది. పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పిస్తోంది. సాగులో ఖర్చులు తగ్గించేందుకు యాంత్రీకరణకు శ్రీకారం చుట్టింది. ఆర్‌బీకేల ద్వారా రైతు గ్రూపులు ఏర్పాటు చేసి 40 శాతం సబ్సిడీతో యంత్రాలు అందజేస్తోంది. దీనిలో భాగంగా గత ఏడాది వైఎస్సార్‌ యంత్ర సేవా పథకం ద్వారా పవర్‌ స్ప్రేయర్లు, కల్టివేటర్లు, రోటావేటర్లు, గడ్డికట్టే యంత్రాలు, ట్రాక్టర్లు సబ్సిడీపై అందించింది. ఈ ఏడాది ఖరీఫ్‌ సీజన్‌ రాక ముందే



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్‌ వేణుగోపాల్‌రెడ్డి

గురువారం రైతుభరోసా ద్వారా పెట్టుబడి సాయం అందించిన సర్కారు.. శుక్రవారం యంత్రాల పంపిణీకి సిద్ధమైంది. వరుసగా రెండో సంవత్సరం వరికోత యంత్రాలు, ట్రాక్టర్లు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేయనుంది. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో జన్మభూమి కమిటీలు చెబితేనే రైతులకు సబ్సిడీపై యంత్రాలు అందేవి. దీంతో అప్పట్లో పలుకుబడి ఉన్న పెద్ద రైతులు సబ్సిడీ యంత్రాలను స్వాహా చేశారు. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వ పాలనలో రైతులకు పారదర్శకంగా పథకాల లబ్ధి చేకూరుతోంది.

793 ట్రాక్టర్లు, 38 వరికోత యంత్రాలు

గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్టీఆర్‌, కృష్ణా, ఏలూరు, పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాలకు కలిపి 793 ట్రాక్టర్లు, 38 వరికోత యంత్రాలను శుక్రవారం ప్రభుత్వం అందించనుంది. దీనికి గుంటూరు నగరం వేదిక కానుంది. గత ఏడాది కూడా జూన్‌ ఏడున ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా గుంటూరులోనే ట్రాక్టర్ల పంపిణీ చేపట్టిన సంగతి తెలిసిందే. గత ఏడాది 1,203 ట్రాక్టర్లు, 78 వరికోత యంత్రాలను సీఎం పంపిణీ చేశారు.

తాజాగా శుక్రవారం గుంటూరు జిల్లాకు 53 ట్రాక్టర్లు, రెండు వరికోత యంత్రాలు, పల్నాడు జిల్లాకు 135 ట్రాక్టర్లు, 3 వరికోత యంత్రాలు, బాపట్ల జిల్లాకు 100 ట్రాక్టర్లు, 3 వరికోత యత్రాలు పంపిణీ చేయనున్నారు. ఒక్కొక్క ట్రాక్టరు విలువ సుమారు రూ.6 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు ఉంటుంది. రైతులు కోరిన ట్రాక్టరును అందించేలా సర్కారు చర్యలు చేపట్టింది.

గతంలో పక్కదారి పట్టిన 'రైతు రథం'

టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతు రథం పేరుతో ఆ పార్టీ నేతలే లబ్ధి పొందారు. సబ్సిడీతో వచ్చిన పవర్‌ స్ప్రేయర్ల నుంచి చిన్నచిన్న యంత్ర పరికరాల వరకు జన్మభూమి కమిటీ నేతలు, ఎమ్మెల్యే, మంత్రి సిఫార్సు చేస్తేనే అందేవి. ట్రాక్టర్ల కొనుగోలులో అవినీతి జరిగింది. టీడీపీ నేతలు భారీగా కమీషన్లు దండుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.

పారదర్శకంగా లబ్ధి..

ప్రస్తుతం ఎక్కడా చిన్న పొరపాటూ లేకుండా ప్రభుత్వం పారదర్శకంగా యంత్ర పరికరాలను అందజేస్తోంది. అర్హత ఉన్న రైతులు గ్రూపులుగా ఏర్పడి రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకుంటే.. ఎవరి సిఫార్సులూ లేకుండా ఎటువంటి కమిటీలకు తావు లేకుండా, కేవలం అర్హతే ప్రామాణికంగా గ్రూపులను ఎంపిక చేసి యంత్రాలు ఇస్తోంది. దీనిలో రైతు వాటా 10శాతం కాగా, రుణం 50 శాతం, సబ్సిడీ 40 శాతం వర్తిస్తుంది.

అర్హులకే యంత్రాలు

ట్రాక్టర్ల పంపిణీకి సంబంధించి ఇప్పటికే కొన్ని గ్రూపులను ఎంపిక చేశాం. ఎక్కడా ప్రలోభాలకు, సిఫారసులకు తావు లేదు. రైతులు ఏర్పాటు చేసుకున్న గ్రూపుల పరిస్థితిని పరిశీలించి, వారితో చర్చించిన తర్వాత రైతుల కోరిక మేరకే ట్రాక్టర్లు, యంత్రాలు పంపిణీ చేస్తున్నాం. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ట్రాక్టర్లు, వరి కోత యంత్రాలు అందజేయనున్నాం.

– ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా కలెక్టర్‌, గుంటూరు.

రైతు భరోసా.. సాగు కులాసా

- అట్టహాసంగా రైతుభరోసా కార్యక్రమం
- 2,55,705 కుటుంబాలకు ప్రయోజనం
- రూ.140.96 కోట్ల మేర లబ్ధి



కలెక్టరేట్‌లో రైతులకు రైతుభరోసా చెక్కు అందజేస్తున్న కలెక్టర్‌ శివశంకర్‌, ఎమ్మెల్యే బొల్లా

నరసరావుపేట: వైఎస్సార్‌ రైతు భరోసా ఆర్థిక సాయాన్ని కర్షకులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్‌ ఎల్‌.శివశంకర్‌ పేర్కొన్నారు. వరుసగా ఐదో విడత సాయం విడుదల కార్యక్రమం గురువారం ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా కర్నూలు జిల్లా పత్తికొండ వేదికగా అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో వర్చువల్‌ విధానంలో కలెక్టరేట్‌ నుంచి వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, కలెక్టర్‌ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌, బ్రహ్మనాయుడు పల్నాడు జిల్లాలోని లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ జిల్లాలోని 2,55,705 కుటుంబాలకు రూ.140.96 కోట్ల మేర లబ్ధి చేకూరిందని వివరించారు. అలాగే అకాల వర్షాలకు నష్టపోయిన 3224 కుటుంబాలకు రూ.294.15 కోట్ల ఇన్‌పుట్‌ సబ్సిడీ చెక్కును కలెక్టర్‌ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ధన్యవాదాలు

నేను రెండు ఎకరాలలో మొక్కజొన్న, వరి వేశాను. అకాల వర్షాలకు తీవ్రంగా పంట నష్టం జరిగింది. ఇన్‌పుట్‌ సబ్సిడీ మేలు చేకూరుస్తోంది. కర్షకులపై అభిమానం చూపిస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– దరువూరి వాసు, రైతు, రావిపాడు, నరసరావుపేట మండలం

ప్రభుత్వ సాయం మరువలేం

ప్రభుత్వం అందిస్తున్న కనీసం మద్దతు ధరకు ధాన్యం విక్రయించా. తొమ్మిది రోజుల్లోనే నగదు ఖాతాలో జమైంది. ఐదు విడతలుగా రైతు భరోసా సాయం అందుతోంది. రైతులు ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయినప్పుడు ఆదుకోవడం గొప్ప విషయం. ఇది రైతు ప్రభుత్వం.

– వి.వెంకటరెడ్డి, రైతు, పాలపాడు, నరసరావుపేట మండలం




ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, అప్పిరెడ్డి, వైఎస్సార్‌ సీపీ నేత డొక్కా మాణిక్యవరప్రసాద్‌, కలెక్టర్‌ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ ఆరిఫ్‌ హఫీజ్‌ తదితరులు

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పూర్తి

గుంటూరు వెస్ట్‌: సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లను గురువారం ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్‌ కో–ఆర్డినేటర్‌ తలశిల రఘురామ్‌, రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్‌ కమిషనర్‌ హరి కిరణ్‌, కలెక్టర్‌ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జాయింట్‌ కలెక్టర్‌ జి.రాజకుమారి, అర్బన్‌ ఎస్పీ ఆరిఫ్‌ హఫీజ్‌, శాసన మండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి, వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవర ప్రసాద్‌, జీడీసీసీ బ్యాంక్‌ చైర్మన్‌ రాతంశెట్టి సీతారామాంజనేయులు, కృష్ణబలిజ, పూసల కార్పొరేషన్‌ చైర్‌పర్సన్‌ కోలా భవాని, జిల్లా అధికారులు పరిశీలించారు. ట్రాఫిక్‌తోపాటు రైతులకు అందజేయనున్న ట్రాక్టర్లు, హార్వెస్టర్లను క్రమపద్ధతిలో ఉంచి వాటిని ముఖ్యమంత్రి చేతులమీదుగా అందించే ఏర్పాట్లపై దృష్టి సారించారు. మొత్తం పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్‌ జిల్లా, ఏలూరు, ప్రకాశం, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలల లబ్ధిదారులు, రైతులు భారీ సంఖ్యలో రానున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రైతుల అభివృద్ధి కోసం చేస్తున్న ఈ మహాయాగంలో తాము పాత్రధారులమైనందుకు సంతోషంగా ఉందన్నారు. ఎక్కడా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, వర్షం వచ్చినా ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు.

ఒకరిని రక్షించబోయి ఒకరు

- బావిలో జారి పడి ముగ్గురు దుర్మరణం
- తండ్రీకొడుకులతోపాటు మరో వ్యక్తి మృత్యుఒడికి
- మోర్జంపాడులో విషాదం


ఎనుముల నాగార్జున , నాగులు , ఆంజనేయులు (ఫైల్‌ ఫొటోలు)

మాచవరం: జీవాలకు దాహార్తి తీర్చేందుకు బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తూ అందులో జారిపడిన బిడ్డను కాపాడేందుకు తండ్రి, వారిద్దరినీ రక్షించేందుకు మరో గ్రామస్తుడు ఒకరి వెంట ఒకరు వెళ్లి బావిలో పడి దుర్మరణం పాలయ్యారు. ఈ హృదయ విదారక ఘటన కొత్తపాలెం శివారు పొలాల్లో గురువారం జరిగింది.

స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మోర్జంపాడు గ్రామానికి చెందిన ఎనుముల నాగులు (40), ఎనుముల నాగార్జున(16), ఎనుముల అంజనేయులు (60) గొర్రెల కాపరులు. గురువారం మధ్యాహ్నం వీరు జీవాలకు నీళ్లు తాగించేందుకు పొలంలో ఉన్న నేల బావి వద్దకు వెళ్లారు. నీళ్లు తాగించే క్రమంలో కొన్ని గొర్రెలు బావి ఒడ్డుకు చేరాయి. వాటిని అవతలికి తోలేందుకు ఎనుముల నాగార్జున కూడా అక్కడకు వచ్చాడు. ప్రమాదవశాత్తూ కాలుజారి బావిలో పడ్డాడు. బావి లోతుగా ఉండడంతో ఊపిరాడక మునిగి పోయాడు. గమనించిన నాగార్జున తండ్రి నాగులు కొడుకును కాపాడేందుకు బావిలోకి దిగాడు. అతనూ మునిగి ఊపిరి ఆడక మృత్యువాత పడ్డాడు. బావిలో పడిన ఇద్దర్నీ రక్షించేందుకు ఆంజనేయులూ బావిలోకి దూకాడు. కొంత సమయం వెతికాడు. బావి లోతుగా ఉండడంతో ఒడ్డుకు వచ్చే ప్రయత్నంలో అలుపు వచ్చి బయటకు రాలేక మునిగిపోయాడు. దూరం నుంచి దీనిని గమనించిన మరో గొర్రెల కాపరి బావి వద్దకు వచ్చి చూడగా ముగ్గురూ కనపడకపోవడంతో మునిగిపోయారని గ్రహించి, పరిసర పొలాల్లో రైతుల సాయంతో విషయాన్ని గ్రామస్తులకు తెలియజేశాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, స్థానిక ఎస్‌ఐ ఎస్‌.కోటయ్య, సీఐ బిలాలుద్దీన్‌, పోలీస్‌ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈత గాళ్ల సహాయంతో మృతదేహాలను బయటకు తీశారు. ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, కొడకుతోపాటు మరో వ్యక్తి మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. బంధువులు, గ్రామస్తులు మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఎమ్మెల్సీ జంగా పరామర్శ

ఘటన గురించి తెలుసుకున్న వైఎస్సార్‌ సీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, శాసన మండలి విప్‌ జంగా కృష్ణమూర్తి ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఇలాంటి ఘటన బాధాకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్‌ సీపీ మండల నాయకులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఘనంగా వెన్నెల చిల్డ్రన్స్ హాస్పిటల్ ప్రారంభం


రిబ్బన్ కట్‌చేసి హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: స్థానిక గుంటూరు రోడ్డులో న్యూరాలజిస్ట్ డాక్టర్ సూర ప్రదీప్‌కుమార్‌రెడ్డి సతీమణి డాక్టర్ లంకా ప్రత్యూష ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వెన్నెల చిల్డ్రన్ హాస్పిటల్ ప్రారంభోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ గజ్జెల బ్రహ్మారెడ్డి, మహాత్మాగాంధీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కారసాని శ్రీనివాస్‌రెడ్డి, ప్రముఖ కంటి వైద్య నిపుణులు, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎం రామలింగారెడ్డి, డాక్టర్ మేకల చంద్రకిరణ్‌రెడ్డి, పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్ ముఖ్యఅతిథులుగా హాజరై హాస్పిటల్‌లోని పలు విభాగాలను ప్రారంభించారు. డాక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కల్పతరువు గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మేనేజింగ్ డైరెక్టర్ లంకా రఘురామిరెడ్డి, సంకట సుబ్బారెడ్డి, ఇప్పల దానారెడ్డి, డాక్టర్ గోనుగుంట్ల శ్రీనివాసరావు, పలువురు పట్టణ ప్రముఖులు హాజరయ్యారు. అతిథులకు డాక్టర్ ప్రదీప్, ప్రత్యూష దంపతులు ఘన స్వాగతం పలికారు.

సమసమాజ స్థాపన ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలి

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, అధికారులు

నరసరావుపేట: జిల్లాలో సమసమాజ స్థాపనకు జిల్లా అధికారులు, పోలీసులు, ఎస్సీ, ఎస్టీ పర్యవేక్షణ కమిటీ సభ్యులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్పందనహాలులో గురువారం సాయంత్రం జిల్లాస్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అంటరానితనం అంతర్గతంగా పలు సామాజిక వర్గాల జీవనవిధానాన్ని, ఆయా సమాజాల భావ స్వేచ్ఛను దెబ్బ తీస్తున్నాయన్నారు. ఇటువంటి తరుణంలో జిల్లా అధికారులు, పోలీసులు, సామాజికవర్గ కమిటీ సభ్యులు అటువంటి వాటిని రూపుమాపడానికి, ఘటనలు జరగకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. పల్నాడు జిల్లా ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు 157 ఎస్సీ, ఎస్టీ కేసులు వాటి పురోగతి, బాధితులకు జరిగిన న్యాయం, ప్రభుత్వం నుంచి అందిన పరిహారం, ఇప్పటికీ కొనసాగుతున్న కేసుల దర్యాప్తులు, జరగాల్సిన న్యాయం, అందాల్సిన పరిహారం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై సమీక్షలో చర్చించారు. కొన్ని కేసులపై ఆరా తీసిన కలెక్టర్ వాటిపై నివేదికను జిల్లా కలెక్టర్ కార్యాలయంకు పంపించాలని ఆర్డీవోలు, డీఎస్పీలకు సూచించారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల మనోభావాలను కాపాడేందుకు, భారత రాజ్యాంగం ద్వారా వారికి లభించిన హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ క్రమంలోనే జిల్లాలో వినూత్నంగా నవోదయం, పల్లెనిద్ర, బడినిద్ర, గ్రామోదయం, నగరోదయం వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేసి, ఆయా సామాజిక వర్గాల సమస్యలను పరిష్కరించడంతోపాటు వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎస్సీ, ఎస్టీ కేసులను వాస్తవ పరిస్థితులు కనుగుణంగా నమోదు చేసి, బాధితులకు మేలు చేయడంతోపాటు ప్రభుత్వ పరిహారం అందేలా చూడడం, సమ సమాజంలో వారి జీవన విధానం మార్పు చెందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో పల్నాడు జిల్లా ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఓబుల నాయుడు, పోలీస్ శాఖకు చెందిన అధికారులు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

–జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్


పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే బొల్లా

నరసరావుపేట: జిల్లాలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. ఈనెలాఖరు వరకు నిర్వహించే బాల కార్మికుల ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని గురువారం కలెక్టరేట్ వద్ద జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, వినుకొండ శాసనసభ్యులు బొల్లాబ్రహ్మనాయుడు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమములో నరసరావుపేట సహాయ కార్మిక కమీషనర్ ఎ.ధనలక్ష్మి, ఫ్యాక్టరీస్ జిల్లా ఇన్‌స్పెక్టర్ ఓ.రాంబాబు, హెల్త్ ఆఫీసర్ ఓ.కాశీవిశ్వనాథం, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ విభాగ పీడీ ఏ అన్నపూర్ణ, జిల్లా చిల్డ్రన్స్ సంరక్షణ అధికారి విజయ కుమార్, మెంబర్స్, టీం సభ్యులు, ఎన్‌జీవోలు పాల్గొన్నారు.

8న వైస్‌చైర్మన్ ఎన్నిక

ఎన్నికల అధికారిగా సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ నియామకం

తెనాలిఅర్బన్: పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 8న ఖాళీగా ఉన్న వైస్‌చైర్మన్ పదవికి ఎన్నిక నిర్వహించాలని ఆదేశించింది. దీనిలో భాగంగా ఎన్నికల అధికారిగా తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మను కలెక్టర్ నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తెనాలి మున్సిపల్ రెండో వైస్‌చైర్మన్‌గా గుంటూరు కోటేశ్వరరావు ఏడాదికి పైగా పనిచేశారు. వ్యక్తిగత కారణాలతో గత ఏడాది డిసెంబర్ 29న వైస్‌చైర్మన్ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి రెండో వైస్‌చైర్మన్ పదవి ఖాళీగా ఉంటూ వచ్చింది. మున్సిపల్ అధికారుల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ బుధవారం వైస్‌చైర్మన్ ఎన్నిక నిర్వహించుకోవచ్చని ఆదేశించింది.

హత్య కేసులో నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ షమీముల్లా, వెనుక వరుసలో నిందితుడు

మాచర్లరూరల్: పొలం తగాదాలో 82 ఏళ్ల అన్నని తమ్ముడు హత్య చేసిన సంఘటనలో నిందితుడ్ని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ షేక్ షమీముల్లా తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెల్దుర్తి మండలం పట్లవీడు గ్రామానికి చెందిన అక్కెం వెంకయ్య (పిచ్చి వెంకయ్య), అక్కెం పకీరయ్యలకు పొలం భాగ పంపిణీలో వచ్చిన విభేదాలను దృష్టిలో ఉంచుకొని గత నెల 28న ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న అక్కెం వెంకయ్య మెడపై తమ్ముడు పకీరయ్య గొడ్డలితో దాడి చేసి హత్య చేసి పారిపోయాడు. నిందితుడు పకీరయ్య కోసం గాలింపు జరుపుతుండగా నాగార్జునసాగర్ కొత్త బ్రిడ్జి వద్ద అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పర్చగా 14రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఏఎంజీ విద్యార్థిని



చిలకలూరిపేట:జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు విద్యార్థిని ఎంపిక కావడం అభినందనీయమని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి చెప్పారు. ఏఎంజీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని బత్తుల అమృతమయి జాతీయ స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగే అండర్-19 బాక్సింగ్ పోటీలలో విద్యార్థిని పాల్గొంటుంది. విద్యార్థినికి ఏఎంజీ ప్రాంగణంలో గురువారం అభినందనసభ నిర్వహించారు. మహంతి మాట్లాడుతూ ఇటీవల రాజమండ్రిలో జరిగిన బాలికల అండర్-19 కేటగిరిలో పాల్గొని రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించిందని చెప్పారు. సంస్థ సీఏవో మాశిలామణి, స్కూల్ హెచ్‌ఎం కె కృపాదానం, పీఈటీలు రాజు, రాజేష్ పాల్గొన్నారు.

మలేరియా దోమ పెరగకుండా ప్రత్యేక చర్యలు

మలేరియా మాసోత్సవం ప్రారంభించిన అధికారులు


డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట మలేరియా మాసోత్సవ ప్రారంభంలో అధికారులు, డాక్టర్లు

నరసరావుపేట: జూన్‌లో నిర్వహించే మలేరియా మాసోత్సవాన్ని గురువారం పల్నాడు రోడ్డులోని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాది కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో జూన్ మాసాన్ని మలేరియా మాసంగా పరిగణించటం జరుగుతుందన్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా మలేరియా మాసోత్సవ కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. జిల్లాలో ప్రతి గృహంలో జ్వర అనుమానితుల నుంచి రక్తపూతలను సేకరిస్తామని, దోమలు పెరగకుండా పారిశుద్ధ్య కమిటీలతో గ్రూపు సమావేశాలు నిర్వహిస్తామని, విలేజ్ కమిటీల సహాయంతో డ్రెయిన్‌లలో పూడిక తీసి శుభ్రం చేయటం జరుగుతుందన్నారు. గ్రామాల్లో అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు అవగాహన కార్యక్రమాలు చేపట్టి, దోమలు పెరగకుండా ప్రత్యేక ద్రావణాలను పిచికారీ చేయటం, దోమతెరలు పంపిణీ చేస్తారన్నారు. పాఠశాల పిల్లలకు అవగాహన నిమిత్తం వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, జిల్లా మాతా శిశు కార్యక్రమ అధికారి డాక్టర్ డి.నాగపద్మజ, జిల్లా మలేరియా అధికారి కె రవీంద్రరత్నాకర్, పట్టణ మలేరియా సిబ్బంది, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రకృతి' ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం

రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్ లక్ష్మీదుర్గ



గుంటూరుఎడ్యుకేషన్: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించడం ద్వారా గ్రామాల్లో ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేలా చూడాలని రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్ లక్ష్మీదుర్గ పేర్కొన్నారు. గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 40 మంది నేచురల్ ఫార్మింగ్ ప్రోత్సాహకులకు(ఎన్ఎఫ్ఎఫ్) ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్ష్మీదుర్గ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజ ల దైనందిన జీవితంలో భాగం చేయాలని, ప్రధానంగా శిశువులు, గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రైతు సాధికార సంస్థ ముఖ్య ఉద్దేశం, ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం అమలు తీరు, ప్రజల ఆరోగ్యంపై ప్రకృతి వ్యవ సాయ ఉత్పత్తుల ప్రభావం, ఎన్ఎఫ్ఎఫ్‌లు గ్రామాల్లో చేపట్టవలసిన పనులు తదితర అంశాలను క్షుణ్ణంగా వివరించారు. నెలరోజుల పాటు గ్రామా ల్లో పనిచేస్తూ అక్కడి స్థితి గతులను పూర్తిగా పరిశీలించాలని అన్నారు. రసాయన వ్యవసాయం వల్ల మనుషుల ఆరోగ్యంతో పాటు నేల ఆరోగ్యం పాడవుతోందని తెలిపారు. గ్రామాల్లో రైతు, పొదుపు మహిళా కుటుంబాలు, నిరుపేద కుటుంబాలతో కలసి, మెలసి ఉంటూ రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేసేవిధంగా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల రుచిని చూపించాలని సూచించారు. గ్రామాల్లో 'ఫార్మర్ న్యూట్రీషన్ స్కూల్స్' ఏర్పాటు చేసి పోషికాహార విలువలు, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రయోజనాలను గురించి వివరించాలన్నారు. రైతు సాధికార సంస్థ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ రాజగోపాల్, వ్యవసాయ అధికారి గోపీచంద్, ఆరోగ్య విభాగపు సిబ్బంది శ్రీలేఖ, ఆశాజ్యోతి పాల్గొన్నారు.

క్రీడాకారుడుకి ప్రభుత్వ సాయం

బాపట్ల: ఈ ఏడాది మార్చిలో జరిగిన ఏషియన్ ఖోఖో ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో బాపట్ల జిల్లా నుంచి బంగారు పతకం సాధించిన అట్ల శివనాగిరెడ్డికి ప్రభుత్వ సాయం అందిస్తామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు.

తెనాలిలో రౌడీషీటర్ దారుణహత్య

- ఉలిక్కి పడిన ఆంధ్రాప్యారిస్!
- పట్టపగలు కత్తులతో హతమార్చిన వైనం


ఘటనాస్థలంలో ఉన్న ప్రశాంత్ మృతదేహం

తెనాలిరూరల్: ప్రశాంతంగా ఉన్న తెనాలి పట్టణం గురువారం ఉదయం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పట్టపగలు నడిరోడ్డుపై ఓ రౌడీషీటర్‌ను కొందరు వ్యక్తులు దారుణంగా హతమార్చారు. కత్తులతో వెంటపడి మరీ నరికి చంపారు. పాతకక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగినట్లు భావిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. తెనాలి పాండురంగపేటకు చెందిన మత్తే ప్రశాంత్ (30) గతంలో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. సుమారు నాలుగేళ్ల క్రితం ప్రశాంత్ మరో 17 మంది కలిసి తెనాలి రైల్వేస్టేషన్ సమీపంలో ఓ యువకుడిని కొట్టి చంపారు. ఈ ఘటన అప్పట్లో తీవ్ర కలకలం రేకెత్తించగా ప్రస్తు తం ఆ కేసు విచారణలో ఉంది. తరచూ గొడవలకు వెళుతుండే ప్రశాంత్ పై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో రౌడీషీట్ ఉంది. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా గుంటూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ అక్కడే ఉంటున్నాడు. ఇతడి భార్య స్వస్థలం భీమవరం కాగా అక్కడ ఓ శుభకార్యం ఉంటే వెళ్లి బుధవారం మధ్యాహ్నం తల్లిని చూసేందుకని తెనాలి వచ్చాడు. అప్పటి నుంచి స్నేహితులతో కలిసి మద్యం తాగుతూ తిరుగుతున్నాడు. మధ్యలో అమరావతి ప్లాట్స్‌లో కొందరితో ఇతడికి ఘర్షణ జరిగినట్లు తెలుస్తోంది. రాత్రి 9 గంటల సమయంలో ప్రశాంత్ తల్లి ఫోన్ చేయగా చెంచుపేట వద్దే ఉన్నాని, కొద్దిసేపట్లో వస్తానని చెప్పినట్లు సమాచారం. అయితే రాత్రికి ఇంటికి చేరని ప్రశాంత్ గురువారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో పాండురంగపేట పద్మావతి కళ్యాణ మండపం రహదారిలో దారుణ హత్యకు గురయ్యాడు. మాస్కులు ధరించి వచ్చిన ఇద్దరు వ్యక్తులు ప్రశాంత్‌పై కత్తులతో వెంబడించారు. వారి నుంచి తప్పించుకుని పారిపోతుండగా వెంటపడి మరీ నరికి చంపారు. తీవ్ర రక్తగాయాలతో ప్రశాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న అన్ని పోలీస్ స్టేషన్ల సీఐలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. త్రీ టౌన్ సీఐ యు.శ్రీనివాసులు, వన్ టౌన్, టూ టౌన్, రూరల్ సీఐలు కె.చంద్రశేఖర్, ఎస్.వెంకట్రావు, కె.శ్రీనివాసరెడ్డి ఘటనా స్థలంలో వివరాలు సేకరించి అనుమానితులను విచారించారు. కొద్దిసేపటికే డీఎస్పీ బి.జనార్ధనరావు కూడా ఘటనా స్థలానికి చేరుకుని హత్య గురించి ఆరా తీశారు. చుట్టుపక్కల సీసీ కెమెరాలను పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు హత్యకు పాల్పడినట్లు గుర్తించినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. మృతుడి తల్లి మత్తే జయలత ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా పట్టపగలు నడిరోడ్డుపై జరిగిన రౌడీషీటర్ హత్యోదంతం పట్టణంలో తీవ్ర కలకలం రేకెత్తించింది.

బందో'మస్తు'గా ఉండాలి

ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఆదేశం

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం నగర పర్యటన దృష్ట్యా బి.డి బృందాలు, విధులు నిర్వహించే అధికార, సిబ్బంది ప్రతి ఒక్కరిని కూలంకుషంగా తనిఖీలు చేశాక లోనికి అనుమతించాలని ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. సీఎం బందోబస్తు పర్యటన దృష్ట్యా గురువారం పోలీస్ పెరేడ్ గౌండ్స్‌లో పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బందితో బ్రీఫింగ్ నిర్వహించారు. అనంతరం చుట్టుగుంట కూడలిలో జరగనున్న సభ వేదిక వద్ద ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. పలు అంశాలపై పోలీసులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సీఎం బందోబస్తు ఏర్పాట్లను సెక్టార్స్ ప్రకారం కేటాయించామన్నారు. సెక్టార్ల పరిధిలో విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, కాన్వాయ్ పార్టీ, రోప్ పార్టీలు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని చెప్పారు. ఇక రూఫ్ టాప్‌లలో వారు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. సీఎం పర్యటించే ప్రాంతాలలో ట్రాఫిక్, వాహనాల నిలుపుదల (పార్కింగ్) ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జిల్లా ఏఎస్పీలు ఎన్.షేక్ (గుంటూరు తూర్పు), కె.సుప్రజ (పరిపాలన), కె.శ్రీనివాసరావు (ఎల్/ఓ), శ్రీనివాసరావు (క్రైం), కె.కోటేశ్వరరావు (ఏఆర్), డీఎస్పీలు పోతురాజు (తుళ్లూరు), బాలసుందరరావు (ట్రాఫిక్), సుభాష్ (ఎస్‌బీ), ఉమా మహేశ్వర రెడ్డి (పశ్చిమ), జనార్ధన్‌రావు(తెనాలి), కేసీహెచ్.రామారావు పాల్గొన్నారు.

కృష్ణానదిలో బీటెక్ విద్యార్థి మృతదేహం

తాడేపల్లిరూరల్:ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి కృష్ణానది ఎగువ ప్రాంతంలో ఆక్వా డెవిల్స్ సమీపంలో కృష్ణానది నీటిలో మృతదేహం ఉన్నట్లు స్విమ్మింగ్ చేసేవారు గురువారం గుర్తించి తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాడేపల్లి ఎస్ఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి వెళ్లి కృష్ణానది నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని బయటకు తీయించారు. ఎస్ఐ మాట్లాడుతూ కృష్ణానది ఎగువ ప్రాంతంలో మృతదేహం లభించిందని, మృతుడి జేబులో ఉన్న ఐడీ కార్డ్ ఆధారంగా హైదరాబాద్ కూకట్‌పల్లిలో బీఎస్ఆర్ కళాశాలలో బీటెక్ చదువుతున్న విద్యార్థిగా గుర్తించామన్నారు.